# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 3, మే 2026




# ముఖ్యమంత్రి, ప్రధాని ఆశీర్వాదంతో నియోజకవర్గ అభివృద్ధి

## * ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**భైంసా, మే 02, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో రెండేళ్లలో ముధోల్ నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. శనివారం భైంసాలోని సురలోక్ గార్డెన్స్‌లో సబ్ కలెక్టర్ సాంకేత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని, ప్రస్తుతం పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 142 కిలోమీటర్లు, ఆర్అండ్‌బి శాఖ ద్వారా 60 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి నిధులు వచ్చాయని, త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సెంట్రల్ రిజర్వ్ ఫండ్ కింద రూ. 50 కోట్లతో మాలేగాంనిగ్వా, ముధోల్‌పంచగుడి డబుల్ లైన్ రోడ్లు వేస్తామన్నారు. బాసర ఆలయ అభివృద్ధికి రూ. 370 కోట్లు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు రూ. 225 కోట్లు, పబ్లిక్ స్కూల్‌కు రూ. 30 కోట్లు మంజూరయ్యాయని, సిరాల ప్రాజెక్ట్, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కూడా చేపడుతున్నామన్నారు. గతం కంటే అదనంగా 15 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని, 80 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసిన రైతులకు ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ట్రాఫిక్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. అనంతరం మహిళా సంఘాలకు రూ. 9 కోట్ల రుణాల చెక్కులను అందజేసి, వివిధ శాఖల స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తాత్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువలో సంక్షేమ పథకాలు

## ● ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్

**కాగజ్‌నగర్,మే 2, ప్రభాతవార్త :**



ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సిర్పూర్ నియోజకవర్గ స్థాయి సమావేశం కాగజ్‌నగర్‌లోని ఎస్పీయం క్లబ్‌లో శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రజలకు సంక్షేమ పథకాలు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహ జ్యోతి, సన్నరకం వరి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి మిగతా 2లో..



# అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు

**ఆసిఫాబాద్, మే 2, ప్రభాతవార్త :**



అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందజేస్తామని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా నియోజకవర్గ స్థాయి సమావేశమునకు అదనపు కలెక్టర్లు యువరాజ్ మార్మట్, ఎం.డెవిడ్, ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవా లక్ష్మి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అనిల్, ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఇరుకుళ్ళ మంగ, ఆసిఫాబాద్ మునిసిపల్ చైర్మన్ మొంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ యం.డి అహ్మద్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపట్టి అర్హులైన లబ్ధి దారులకు పథకాలు అందిస్తున్నదని కలెక్టర్ అన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 24209 మందికి చేయూత పెన్సన్ దారులకు 22.50 కోట్ల రూపాయలను అందించిందన్నారు. ఇటీవల ప్రభుత్వం నియోజకవర్గంలో 36179 కుటుంబాలకు కొత్త రేషన్కార్డులు అందించి సన్న బియ్యం పంపిణి చేస్తున్నామన్నారు. రైతు భరోస పథకం ద్వారా 1.22 లక్ష మంది రైతులకు 221 కోట్ల రూపాయలను రైతుల మిగతా 2లో..

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి.. యువత ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

నస్పూర్‌లో గంజాయి దుష్పరిణామాలపై పోలీసుల అవగాహన సదస్సు

**నస్పూర్, మే 02, ప్రభాతవార్త**



సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం, కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వీటికి దూరంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. నస్పూర్ పట్టణంలోని ఎంఎం గార్డెన్‌లో మంచిర్యాల రూరల్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి వినియోగం, దాని దుష్పరిణామాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో విద్యార్థులు, యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వపై కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మిగతా 2లో..

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యాచరణను అందరి భాగస్వామ్యంతో అమలు చేయాలి

## ● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మే 02, ప్రభాతవార్త**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక మంచిర్యాల మిగతా 2లో..



## ప్రజలకు చేరువలో సంక్షేమ పథకాలు

(మొదటిపేజీ తరువాయి)

(ఎస్‌హెచ్‌జిల బ్యాంకు లింకేజీ), వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలపై సమగ్రంగా వివరించారు. ఈ ప్రణాళికల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత సమర్థవంతంగా అందుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, డీఎస్పీ వహీదుద్దీన్, ఏఎంసీ చైర్మన్ సిద్దాల దేవయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి.. యువత ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్ల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ నిందితులను పట్టుకుంటున్నట్లు తెలిపారు. మత్తుకు బానిసలైన వారిని గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నామని, అవసరమైతే పునరావాస కేంద్రాలకు పంపిస్తున్నామని వివరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత జీవితాలే కాకుండా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. అనంతరం డ్రగ్స్ వలన కలిగే దుష్ప్రభావాలను వివరించే గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ ఎన్. వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, మంచిర్యాల రూరల్ సీఐ గోపతి రవీందర్, నార్కోటిక్స్ విభాగం ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, సిసిసి నస్పూర్ ఎస్ఐ ఎం. ప్రశాంత్, హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, ఇతర పోలీస్ అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఖాతాలో జమ చేయడం జరిగిందని అన్నారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, పతకం క్రిందా 6957 లబ్ది దారులకు 59.38 కోట్ల రూపాయలను లబ్దిదారులకు చెక్కుల రూపంలో అందించడం జరిగిందన్నారు. నియోజక వర్గంలో ఇప్పటి వరకు మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లు 5029 ఇండ్లను మంజూరి చేయడం జరిగిందని అన్ని ఇండ్లూ పురోగతిలో వున్నాయని అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు 39223 కుటుంబాలకు ఇప్పటి వరకు 6.27 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. 500 రూపాయలకి గ్యాస్ సిలిండర్ 29161 కుటుంబాలకు సబ్సిడీ రూపాయలు 24.62 కోట్ల రూపాయలు లబ్దిదారుల ఖాతాలో జమ చేయడం జరిగిందని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి ఆధ్వర్యం లో పాఠశాలఅభివృద్ధి మౌళిక వసతుల కల్పన పనులు కొరకు 503 పాఠశాలలో 163 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం విద్య రంగా అభివృద్ధికి కృషి చేస్తుందని, వచ్చే విద్య సంవత్సరములో ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులకు అల్పాహారం , స్కూల్ కిట్టులను అందించడం జరుగుతుందని ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ప్రారంబించడానికి చర్యలు తీసుకుంటదన్నారు. ఈ నెల 4 నుండి 9 వరకు రైతు వారోత్సవ కార్యక్రమములో ప్రజా ప్రతి నిధులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గోనాలన్నారు. ఇళ్ళ గణన కార్యక్రమములో భాగంగా మే 10 వరకు ప్రతి ఒక్కరు స్వీయ గణన చేసుకోవాలన్నారు. ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవా లక్ష్మి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గా బాద్యతలు తిసుకున్నప్పటి నుండి ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నారని, ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి నిధులు మంజూరి చేసి మారుమూల గ్రామాలకు త్రాగు నీరు అందించాలన్నారు. రహదారి సౌకర్యాలు కల్పించడానికి నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమములో అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఎంపిడిఓలు, పంచాయతి కార్యదర్శులు, స్వయం సహాయక మహిళా సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధం

**ఆసిఫాబాద్, మే 2, ప్రభాతవార్త :**

ఈ నెల 3న జిల్లాలో జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జనకపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, బాలుర జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ పరీక్షకు 316 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సెంటర్ లోకి అనుమతించడం జరుగుతుందని, మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు తమతో అడ్మిట్ కార్డుతో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు గల ఒరిజినల్ ఐడి కార్డ్ వెంట తెచ్చుకోవాలని, ప్రతి అభ్యర్థి అడ్మిట్ కార్డు పై ఒక పోస్ట్ కార్డ్ సైజు ఫోటో అతికించుకొని రావాలని, అదనంగా ఒక పాస్ ఫోటో తెచ్చుకోవాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రంలోకి ఆభరణాలు, ఎలక్ట్రానిక్ లేదా కమ్యూనికేషన్ పరికరం, పెన్ను, పెన్సిల్, ఎరేజర్, షార్పనర్, కరెక్షన్ ఫ్లూయిడ్ తీసుకురావద్దని తెలిపారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందని, పరీక్ష ప్రారంభం నుండి చివరి వరకు మొత్తం విడియో రికార్డ్ చేయడం జరుగుతుందన్నారు. పరిక్షా కేంద్రంలో 22 సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 28 మంది ఇన్విజిలేటర్లు, ఒక పరిశీలకుడు, ఇద్దరు చీఫ్ సూపరింటెండ్స్ ఉంటారని, వీరితో పాటు పరీక్షా విధులలో కేటాయించిన సిబ్బంది మాత్రమే ఉంటారని తెలిపారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యాచరణను అందరి భాగస్వామ్యంతో అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గస్థాయి సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్శి మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, లక్షెట్టిపేట మున్సిపల్ చైర్ పర్సన్ దొంత అంజలి, వైస్ చైర్ పర్సన్ మోత్కూరి రాజేశ్వరి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, పెన్షన్లు అందించడం జరుగుతుందని, చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా రైతు భరోసా, రైతు బీమా పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని, వ్యవసాయ సాగు ఉత్పత్తులకు మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి కొనుగోలు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు.

మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని, రాబోయే తరాలకు మంచి భవిష్యత్తు అందించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రి ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, కరకట్ట మంజూరు చేసి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా ప్రజలతో పాటు సమీప ప్రాంతాల ప్రజల కొరకు మంచిర్యాల పట్టణంలో 300 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా ప్రజలు వైద్య చికిత్సల నిమిత్తం హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్ళకుండా స్థానికంగా అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు త్రాగునీటితో పాటు వ్యవసాయ రంగానికి సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. మనిషి చనిపోయిన తర్వాత అంత్యక్రియలకు నిరుపేదలకు ఇబ్బందులు పడకుండా మంచిర్యాల పట్టణంలో మహాప్రస్థానం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రణాళికాబద్ధంగా అత్యంత వేగవంతంగా పనులు పూర్తి చేసిన అధికారులు, ఇంజనీర్లు, సిబ్బందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు మంజూరు కాని అర్హులైన లబ్ధిదారులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అర్హులకు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 92 వేల రేషన్ కార్డులలోని దాదాపు 2 లక్షల 73 వేల మంది లబ్ధిదారులకు చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సంస్థ ఆస్తుల పరిరక్షణే సెక్యూరిటీ విభాగం ప్రధాన ధ్యేయం: సీఎస్ఓ బాలరాజు

### - శ్రీరాంపూర్ గెస్ట్ హౌస్‌లో బెల్లంపల్లి రీజియన్ సెక్యూరిటీ సమీక్షా సమావేశం



**నస్పూర్, మే 02, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థ ఆస్తులను కాపాడటమే సెక్యూరిటీ విభాగం ప్రథమ కర్తవ్యమని, ఇందుకోసం పోలీస్ విభాగంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (కార్పొరేట్) బాలరాజు ఆదేశించారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియా గెస్ట్ హౌస్ కాన్ఫరెన్స్ హాల్‌లో బెల్లంపల్లి రీజియన్ సెక్యూరిటీ పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సంస్థ ఆస్తుల పరిరక్షణలో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎదురవుతున్న సవాళ్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సింగరేణి సెక్యూరిటీ విభాగంతో పాటు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు కలిసికట్టుగా కృషి చేయాలని బాలరాజు కోరారు. ముఖ్యంగా స్క్రాప్ దొంగల వల్ల ఎదురవుతున్న సమస్యలు, వారిని పట్టుకున్నప్పుడు వస్తున్న ఒత్తిళ్లు, నమోదైన ఎఫ్ఐఆర్ ల ప్రస్తుత స్థితిగతులపై శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కా రెడ్డి, మందమర్రి సెక్యూరిటీ ఆఫీసర్ రవి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు వివరించారు. దొంగతనాల నియంత్రణకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సంస్థ పరిధిలోని అన్ని విభాగాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. భద్రతా సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల ఎస్ అండ్ పీసీ ఇన్‌స్పెక్టర్లు, జమేదార్లు, ఇంటలిజెన్స్ గార్డ్స్, ఎంటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్లోబల్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ సర్టిఫికెట్లు అందజేత



**లక్షెట్టిపేట, మే 02, ప్రభాతవార్త**

లక్షెట్టిపేటలోని గ్లోబల్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం స్థానిక కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు రెండు వందల మంది విద్యార్థిని, విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్జీపిఆర్ఎస్ అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, జిల్లా ఆర్టిఏ మెంబెర్ అంకతి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరి చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రస్తుత రోజుల్లో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని పేర్కొన్నారు. బొప్పు సుమన్ చొరవ తీసుకుని విద్యార్థుల కోసం ఇలాంటి అద్భుతమైన ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా గొప్ప విషయమని వారు కొనియాడారు. పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేస్తున్న సుమన్ గారి కృషిని వారు ప్రత్యేకంగా అభినందించారు. శిక్షణ పొందిన విద్యార్థులు తమ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని అతిథులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జిల్లా స్పోక్ పర్సన్ బియ్యాల తిరుపతి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చింత అభినయ్, మండల అధ్యక్షులు పింగళి రమేష్, యూత్ అధ్యక్షులు రాందేని వెంకటేష్, సన్నీ, సందేలా సురేష్ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్లోబల్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం మహిళలకు షీ టీమ్ అవగాహన

**కాగజ్‌నగర్, మే 2, ప్రభాతవార్త :**



ప్రజా పాలన – ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి నీతిక పంత్ ఆదేశాల మేరకు కాగజ్నగర్ రూరల్ మండల్ లో దరిగావ్ గ్రామము లోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మహిళలకు షీ టీమ్ ఇన్చార్జి సునీత, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నపిల్లల భద్రతపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. కొత్త చట్టాలు అయిన బి.ఎన్.ఎస్ గురించి విద్యార్థులకు వివరించి, మహిళల భద్రత, చిన్నపిల్లల రక్షణ, లింగ సమానత్వం, సైబర్ నేరాలు, బాల్య వివాహాల నివారణ వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీస్ సహాయం పొందేందుకు డయల్ 100, 112 సేవలతో పాటు 1930 (సైబర్ మోసాల హెల్ప్‌లైన్), 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పి రాజేశం షీ టీమ్ సిబ్బంది రమాదేవి, శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.




భైంసాలో మాట్లాడుతున్న పిఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు

## మే 5న నిరాహార దీక్షలను విజయవంతం చేయండి

**- బివి రమణారావు**

**భైంసా, మే 02, ప్రభాతవార్త:**

తెలంగాణ జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో ఈనెల 5న నిర్వహించనున్న సామూహిక నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని పిఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బివి రమణారావు పిలుపునిచ్చారు. భైంసాలోని పిఆర్‌టీయూ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 51 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పిఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 13 వేల కోట్ల బిల్లులను రెండు విడతల్లో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డుల అమలు, పెండింగ్ ఐదు డిఏల విడుదల, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో జూన్ 2 తర్వాత ప్రత్యక్ష ఉద్యమ కార్యచరణ చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సయ్యద్ అన్సర్, జై శివరాం, వందన, గోపాల్, గంగాధర్, అబ్దుల్ అహద్, బాబూరావు, లక్ష్మీకాంత్ షిండే, భీమ్రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కలెక్టర్ చేతుల మీదుగా శ్రమశక్తి అవార్డు అందుకుంటున్న స్వదేశీ పరిగిపండ్ల

## స్వదేశీ పరిగిపండ్లకు నిర్మల్ జిల్లా శ్రమశక్తి అవార్డు ప్రధానం

**సారంగాపూర్, మే 02, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కేంద్రంలో కార్మిక శాఖ, ఉద్యోగ కర్మాగారాల శాఖ సంయుక్తంగా నిర్వహించిన వేడుకల్లో తాండ్ర గ్రామ నివాసి, ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు స్వదేశీ పరిగిపండ్లకు శ్రమశక్తి అవార్డు అందజేశారు. వలస కార్మికుల హక్కుల కోసం ఆయన చేస్తున్న పోరాటాన్ని గుర్తిస్తూ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, సహాయ లేబర్ కమిషనర్ ముత్యం రెడ్డి ఈ అవార్డును ప్రధానం చేశారు. జిల్లాలో కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో కార్మిక శాఖ అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, మే 02, ప్రభాతవార్త**



నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో కలుపు మందులు, నకిలీ, నిషేధిత విత్తనాల నియంత్రణపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మీరటి రాజేశ్వరి లతో కలిసి హాజరై వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నకిలీ, నిషేధిత విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ పరిస్థితులలో వారిని నాణ్యమైన విత్తనాల వినియోగం వైపు మళ్లించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రతి సంవత్సరం నకిలీ విత్తనాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు సాగు చేసే పంటల దిగుబడికి అవసరమైన మెలకువలను అందించడంతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన, నాణ్యమైన విత్తనాలు వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిషేధిత కలుపు మందుల వినియోగం, తత్ఫలితంగా కలిగే నష్టాలపై వివరించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు నియంత్రణపై టాస్క్ ఫోర్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని, విత్తన, క్రిమిసంహారక విక్రయ డీలర్లు, దుకాణాలను తనిఖీ చేయాలని, నిబంధనలు పాటించని వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం సూచించిన ఈ రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని, పంట సాగులో శాస్త్రీయ, సేంద్రీయ పద్ధతులను అవలంబించడం ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయం, వినియోగం నియంత్రణపై సంబంధిత శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. గత సంవత్సరం నకిలీ విత్తనాల లభ్యత ఆధారంగా నకిలీ విత్తనాలను నిల్వచేసే ప్రాంతాలను గుర్తించి తనిఖీలు చేపట్టాలని తెలిపారు. విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించే దుకాణాలను తనిఖీ చేయాలని, నిబంధనలను వుల్లంగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్‌ను సన్మానించిన మార్కెట్ చైర్మన్ ఆనందరావు పటేల్

**భైంసా, మే 02, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌ను భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆత్మ చైర్మన్లు సిద్ధం వివేకానంద, గన్ను నర్సారెడ్డిలతో కలిసి కలెక్టర్‌తో రైతుల సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా మొక్కజొన్న కొనుగోళ్లు, గన్నీ బ్యాగుల కొరత, రవాణాకు అవసరమైన లారీల సౌకర్యం వంటి అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే భైంసాకు వచ్చి క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్



రోగనిరోధక కార్యక్రమం నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

## ఎండ తీవ్రత దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

**నేరడిగొండ, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలం కిష్టాపూర్ గ్రామంలో శనివారం సార్వత్రిక రోగనిరోధక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవో పవార్ రవీందర్ మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. అనంతరం గ్రామంలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సంతోశ్, ఏఎన్ఎంలు అన్నీబాయి, చంద్రకళ పాల్గొన్నారు.

# ఘనంగా హిందూ ఆత్మీయ సమ్మేళనం

**సారంగాపూర్, మే 02, ప్రభాతవార్త:**

మండలంలోని జాం గ్రామంలో శుక్రవారం రాత్రి హిందూ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా సాగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన మహాదేవ స్వామి మాట్లాడుతూ హిందూ సాంస్కృతిక ఆచార సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, వాటిని పిల్లలకు నేర్పించాలని కోరారు. హిందూ జీవన విధానం, కట్టు, బొట్టు, ఆధ్యాత్మిక చింతనను పిల్లల్లో పెంపొందించాలని సూచించారు. వేల సంవత్సరాల నుంచి సంస్కృతిపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టి మన ఉనికిని కాపాడుకోవాలన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను శివాజీలా తీర్చిదిద్దాలని, సంప్రదాయాల వ్యాప్తిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముఖ్య వక్తలుగా రుద్రోజి శ్రీనివాస్, దస్తగిరి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, గ్రామ నాయకులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



## ఇకపై ఆర్డిఓ కార్యాలయంలో ప్రజావాణి

**ఆసిఫాబాద్ టౌన్, మే 2, ప్రభాతవార్త :**

ఇకపై ప్రతీ సోమవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో (ఆర్డిఓ) అర్జీదారుల సౌకర్యార్థం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ఆర్ డి ఓ లోకేష్ రావ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జిల్లా పాలనాధికారి కార్యాలయాల్లో అమల్లో ఉన్న ప్రజావాణి కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జిఓఎంఎస్ నెం.3 ప్రకారం ప్రభుత్వ సూచనల మేరకు రెవెన్యూ డివిజన్ స్థాయికి విస్తరించేందుకు నిర్ణయించబడిందన్నారు. ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిర్వహించబడునట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షత వహిస్తూ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, డివిజన్ పరిధిలోని అన్ని శాఖల డివిజనల్ స్థాయి అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావలని కోరారు.

# స్నేహ వేసవి శిబిరాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్, మే 2, ప్రభాతవార్త :**

జిల్లాలోని 1518 సంవత్సరాల లోపు వయస్సు గల బాలికలు స్నేహ వేసవి శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో నిర్మాణాత్మక శిక్షణ ప్రణాళిక అమలుపై ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మార్మాట్ తో కలిసి కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ 1518 సంవ్వత్సరాల లోపు బాలికలకు ఈ నెల 2 నుండి జూన్ 10 వరకు మండల స్థాయిలో స్నేహ వేసవి శిభిరాలు నిర్వహించాలన్నారు. ఈ శిభిరంలో వేసవి కాలంలో విద్య కొనసాగింపు, ఆరోగ్య సేవల సమన్వయం, భద్రత అవగాహన, జీవన నైపుణ్యాలు, బాల్య వివాహాల నివారణ కార్యక్రమాల పై ద్రుష్టి సారించాలన్నారు. సంబందిత అధికారులు సమన్వయతో పనిచేసి వేసవి శిభిరాలను పకడ్బందిగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దత్తారావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాం, డివిజనల్ పంచాయతి అధికారి ఉమర్ హుస్సేన్, సెర్ప్ డిపిఎంలు రామకృష్ణ, యాదగిరి, సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరిత



ఉదయ్ కిరణ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

## దళిత విద్యార్థుల సేవలకు గుర్తింపు..

### - ఉదయ్ కిరణ్‌కు ఎమ్మెల్యే అభినందనలు

**నస్పూర్, మే 02, ప్రభాతవార్త**

దళిత విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న నస్పూర్‌కు చెందిన కోంద్ర ఉదయ్ కిరణ్‌ను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అభినందించారు. మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా దళిత విద్యార్థులకు ఉదయ్ కిరణ్ అందించిన సేవలకు ఈ గుర్తింపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శనివారం ఉదయ్ కిరణ్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవను ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రశంసించారు. వెనుకబడిన వర్గాల విద్యార్థుల ఉన్నతికి ఉదయ్ కిరణ్ నిరంతరం శ్రమిస్తున్నారని ప్రేంసాగర్ రావు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సేవా దృక్పథంతో పనిచేసే యువతకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మాదిగ యూత్ సభ్యులు చంద్రగిరి నరేష్, దాసరి విజయ్ సాగర్, కాశిపాక శంకర్, సీపెల్లి రోహిత్, చిలుముల సాయి అశ్వంత్, గడ్డం పృథ్వి, సుద్దాల సురేష్, సురేష్, రవి, అచల్, గంగన్న, సంపత్, అజయ్, భరత్ ఇతర నాయకులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ స్థాయి గ్రామసభలో ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై సమీక్ష

**బెల్లంపల్లి, మే 02, ప్రభాతవార్త**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం రోజున నియోజకవర్గ స్థాయి గ్రామసభ సమావేశం ఆర్‌పీ గార్డెన్, కన్నాలలో సబ్ కలెక్టర్ మనోజ్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, గ్రామ పంచాయితీ ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొని నియోజకవర్గ అభివృద్ధి నివేదికపై సమగ్ర వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్లాగ్‌షిప్ పథకాలు ఇందిరా మహిళా శక్తి, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, గ్యాస్ సబ్సిడీ, తెల్ల రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వంటి



పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అధికారులు తెలిపారు. గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు ఇప్పటికే కార్యక్రమాలు నిర్వహించగా, ప్రస్తుతం నియోజకవర్గ స్థాయిలో కూడా విస్తృతంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె. సంపత్ కన్వీనర్‌గా వ్యవహరించగా, తహశీల్దార్ కృష్ణ, గ్రామ, మండల స్థాయి అధికారులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ కార్యక్రమం

**బెల్లంపల్లి, మే 02, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని నిరుద్యోగ యువత, విద్యార్థులు, గృహిణుల కోసం టామ్ ఫౌండేషన్ అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోంది. కీరాక్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో దివంగత తాళ్లపల్లి లక్ష్మి జ్ఞాపకార్థం 30 రోజుల ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు టామ్ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ కేవలం ఒక భాష మాత్రమే కాకుండా ఒక గొప్ప అవకాశమని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు. శిక్షణలో భాగంగా ప్రాథమిక వ్యాకరణం, వాక్య నిర్మాణం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఇంటర్వ్యూలలో విజయం సాధించేందుకు అవసరమైన మెలకువలతో పాటు వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక తరగతులు నిర్వహించబడతాయి. ఈ శిక్షణకు సంబంధించిన నమోదు ప్రక్రియ మే 1వ తేదీ నుండి ప్రారంభమవుతుందని, తరగతులు మే 4వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని తెలిపారు. కోర్సు పూర్తిగా ఉచితం కాగా, సీట్లు పరిమితంగా ఉన్నందున ఆసక్తి గల అభ్యర్థులు త్వరగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం టామ్ ఫౌండేషన్ నిర్వాహకురాలు రాధిక, సదేశ్ కుమార్‌ను 9866920170 నంబర్‌లో సంప్రదించవచ్చు. బెల్లంపల్లి ప్రాంత ప్రజలు ఈ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని టామ్ ఫౌండేషన్ కోరుతోంది.

## శ్రీరాంపూర్ భూగర్భ గనుల ఉత్పత్తి తీరు అభినందనీయం

### - జీఎం మునిగంటి శ్రీనివాస్

### - ఏప్రిల్ నెలలో ఐదు గనుల్లో వంద శాతం పైగా బొగ్గు ఉత్పత్తి సాధన

**నస్పూర్, మే 02, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆరు భూగర్భ గనులలో ఐదు గనులు 100 శాతానికి పైగా బొగ్గు ఉత్పత్తి సాధించడం శుభపరిణామం అని ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏప్రిల్ నెలకు సంబంధించిన బొగ్గు ఉత్పత్తి వివరాలను ఆయన వెల్లడించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధన దిశగా ఉద్యోగులు, అధికారులు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఏప్రిల్ నెలలో భూగర్భ గనులు 99 శాతం ఉత్పత్తి సాధించగా, ఉపరితల గనులు 44 శాతం ఉత్పత్తిని నమోదు చేశాయని, మొత్తంగా ఏరియాలో 56 శాతం ఉత్పత్తి జరిగినట్లు జీఎం వివరించారు. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ పరిస్థితుల వల్ల డీజిల్ కొరత ఏర్పడటం, ప్రైవేట్ కాంట్రాక్ట్ ఒప్పంద సమస్యలు, ఓబీ వెలికితీతలో జాప్యం కారణంగా ఉపరితల గనుల్లో ఉత్పత్తికి ఆటంకం కలిగిందని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, వేసవిలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అలాగే ఏరియాలో కొత్తగా 400 క్వార్టర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఏప్రిల్ మాసంలో మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామని జీఎం గుర్తు చేశారు. పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సాహక బహుమతులతో అభినందించినట్లు తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం ఉచిత క్రీడ శిబిరాలు ప్రారంభించామని, మహిళా సాధికారత కోసం సింగరేణి సేవా సమితి ద్వారా 547 మందికి వివిధ వృత్తి విద్యల్లో శిక్షణ పూర్తి చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, సీనియర్ పీఓ సురేందర్ పాల్గొన్నారు.






## విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా అవగాహన పోస్టర్ విడుదల

**జన్నారం, మే 2, ప్రభాతవార్త**

జన్నారం మండలంలోని చింతగూడ గ్రామంలో శనివారం రోజున విద్యుత్ వారోత్సవాలలో భాగంగా విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కరెంటు షాక్ తగలకుండా రైతులు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తూ రూపొందించిన అవగాహన పోస్టర్‌ను సర్పంచ్ సుతారి సుమలత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు పొలాల వద్ద, ఇళ్ల వద్ద విద్యుత్ వైర్లను ముట్టుకోవద్దని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, తెగిపడిన వైర్లను తాకవద్దని, వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. అలాగే లో వోల్టేజ్ సమస్యను సర్పంచ్ దృష్టికి గ్రామస్తులు తీసుకురాగా వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి లో వోల్టేజ్ సమస్య ఉన్న రెండు వీధుల్లో 15 కేవీ ట్రాన్స్ఫార్మర్లు బిగించారు. ఈ సంధర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ గంగన్న, జూనియర్ లైన్మెన్ తిరుపతి, వార్డు మెంబర్ అరె శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్, కుమార్, మెడ విజయ్, ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఘనంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశం

**నిర్మల్, మే 02, ప్రభాతవార్త:**



నిర్మల్ పట్టణంలోని దివ్య గార్డెన్స్‌లో శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశం ఘనంగా సాగింది. ఈ కార్యక్రమానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా విద్య, వైద్యం, పారిశుద్ధం, మౌలిక సదుపాయాల కల్పన వంటి రంగాల్లో కృషి చేస్తోందని తెలిపారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా వచ్చే వారం నుంచి జిల్లా వ్యాప్తంగా రైతు వారోత్సవాల్లు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రజా పాలన కార్యక్రమాలకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు విశేషంగా సహకరిస్తున్నారని అభినందించారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేసి, వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, డిఎంహెచ్వో డాక్టర్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.